

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	గురువారం	శుక్రవారం
కర్నూలు	6:31	5:03
నంద్యాల	6:28	5:03



ఉద్యాన పంటలపై దృష్టి

- ప్రతి ఇంటికి బ్రాడ్ బాండ్ నెట్‌వర్క్
- వర్క్‌ఫ్రం హోం దిశగా అడుగులు
- అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో నంద్యాలపై సంతృప్తి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు
- జిల్లా స్థూల ఉత్పత్తిని పెంచేలా చర్యలు
- పెట్టుబడులకు అనుగుణంగా జిల్లాను తీర్చిదిద్దుతాం
- కలెక్టర్ రాజకుమారి ప్రజంటేషన్

నంద్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెంచాలి. లైవ్‌స్టాక్ అభివృద్ధి పరంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ.. తలసరి ఆదాయాన్ని కూడా పెంచే దిశగా పని చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్ రాజకుమారికి దిశానిర్దేశం చేశారు. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సు చివరి రోజు బుధవారం జిల్లా ప్రగతి, చేపట్టాల్సిన పనులు, ఆయా శాఖల పురోగతి వంటి అంశాలను కలెక్టర్ రాజకుమారి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం పని తీరుతో పాటు.. ప్రజలకు అందించే సేవలపై సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు.

● ఉపాధి హామీ నిధులతో...

రానున్న రోజుల్లో ఉపాధి నిధులతో.. వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను విరివిగా నిర్మించి భూగర్భ జల మట్టాలను పెంచాల్సిన అవసరం ఉంది. చెరువులు, రిజర్వాయర్లలోని భూ ఉపరితల జల మట్టాలు ఎక్కడికక్కడ తగిన స్థాయిలో నిల్వ ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు కెనాల్స్ ద్వారా ప్రవహించే జలాలను కూడా పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలి.



● విస్తారంగా ఉద్యాన పంటలు

జోన్-5 జిల్లాల్లోని అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ఉద్యాన పంటలను విస్తృతంగా సాగుచేయడం జరుగుతోంది. కావున రైతులకు అనుగుణంగా.. ప్రీ హార్వెస్టింగ్, హార్వెస్టింగ్, పోస్ట్ హార్వెస్టింగ్ ఉత్తమ విధానాలను అమల్లోకి తెచ్చే విధంగా చూడాలని సూచించారు. వీటితో పాటు రైతులకు పంటలకు తగిన మద్దతు ధరలు వచ్చేంత వరకు నిల్వ చేసుకునే కోల్డ్ చైన్ లింకేజీ సౌకర్యాలను మరింత పెంచాలని సూచించారు. వీటితో పాటు ప్రతి గృహానికి బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్ సదుపాయం కల్పించి సుమారు 20 లక్షల మంది వర్క్ ఫ్రం హోం విధానం ద్వారా పనిచేసుకునే సౌకర్యం కల్పించాలి. జిల్లాలో ప్రముఖ దేవాలయాలు ఉండటంతో టెంపుల్ టూరిజం దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

స్థూల ఉత్పత్తిని పెంచేలా చర్యలు: కలెక్టర్

జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 15శాతం ప్లస్ గ్రోత్ రేట్ సాధించే దిశగా జిల్లా ప్రగతి ప్రణాళికలను రూపొందించడంతో స్థూల ఉత్పత్తిని పెంచే విధంగా చర్యలు చేపట్టామని కలెక్టర్ రాజకుమారి సీఎం చంద్రబాబుకు వివరించారు. అదేవిధంగా దేశీయ ఉత్పత్తుల పెంపకంతో పాటు జిల్లాను పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా తీర్చుదిద్దుతామని తెలియజేశారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు పర్యాటకంతో 43 శాతం.. సర్వీసు విభాగం పరంగా 39 శాతం.. పరిశ్రమల ద్వారా 18 శాతం మొత్తంగా.. వంద శాతం జీవీఆర్ జిల్లా అభివృద్ధికి సహకరిస్తుందని తెలియజేశారు. జిల్లాలో 46,555 కోట్ల జీవిఏకు (గ్రాస్ వాల్యూ యాడెడ్)ను 15.45 శాతంతో పెంచేలా చూడాలని ప్రణాళిక సిద్ధం చేశామని గుర్తు చేశారు.

● వ్యవసాయ అనుబంధ శాఖల పరంగా జిల్లాలో 65 శాతం బీడు భూములు ఉన్నట్లు గుర్తించాం. వీటిలో సుమారు 40 వేల ఎకరాల్లో భూసాంద్రతను బట్టి సోయా, బజ్రా, బ్లాక్ గ్రాం తదితర వాటిని పెంచే దిశగా.. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాల సహకారంతో పాటు స్పెషల్ సీఎస్ఆర్, వ్యవసాయ యూనివర్సిటీల సహకారం తీసుకుంటామని నివేదించారు. జిల్లాలో దేశీయ రకాల ఉత్పత్తులను పెంచడంతో పాటు ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపే విధంగా చైతన్యం తీసుకువస్తామని తెలియజేశారు.

● రైతులకు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చి 40 డ్రోన్స్ ఇప్పటికే వినియోగంలోకి తెచ్చాం. జిల్లా వ్యాప్తంగా 48వేల హెక్టార్లలో ఉద్యాన పంటలను సాగు చేయడం జరుగుతోంది. భవిష్యత్‌లో మరో 10 వేల ఎకరాల వరకు విస్త రించేలా చూస్తాం. ఏడు వేల హెక్టార్లలో డ్రిప్, మైక్రో ఇరిగేష్ ద్వారా ప్రమోట్ చేస్తే.. పంట ఉత్పత్తులు 25శాతం నుంచి 30శాతం పెరిగే అవకాశం ఉంది. పండ్ల తోటల పెంపకం ద్వారా ఎకరాకు 26 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావడంతో పాటు బంచ్ ప్రొడక్షన్ చేయడం ద్వారా ఎకరాకు 40 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని గుర్తు చేశారు. మొత్తంగా జిల్లాలో ఉత్పత్తి అయ్యే వాటికి వాల్యూబ్రాండింగ్ చేర్చడంతో ద్వారా రూ.వెయ్యి కోట్ల జీడీపీకి పెంచే దిశగా మండల, జిల్లా స్థాయి ప్రణాళికలను తయారు చేశామని తెలియజేశారు.

● లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి జిల్లాలో మిల్క్, మీట్‌కు వినియోగం అధికంగా ఉంది. ఇదే క్రమంలో జిల్లాలో 5లక్షల మేకలు, పొట్టేలు ఉన్నాయని.. 11 లక్షల లీటర్ల వరకు పాల ఉత్పత్తి జరుగుతోందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో అదనంగా మరో ఆరు లక్షల లీటర్లు పాల ఉత్పత్తి పెంచేలా చూస్తాం. అదేవిధంగా రోళ్లపాడు, నల్లమల అటవీ ప్రాంతాల్లో రిసార్ట్ నిర్వహించి అధిక శాతం గిరిజనులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

● జిల్లాలో ఉన్న ఐదు రిజర్వాయర్లు, 124 ఎంఐ ట్యాంకుల్లో చేపలను ఉత్పత్తి చేసి జిల్లాకు వినియోగించిన తరువాత మిగిలిన ఉత్పత్తులను వివిధ నగరాలకు రవాణా చేసే అవకాశం ఉంది. జిల్లాలో 500 ఎంఎస్ఎంఈల యూనిట్లకు, పీఎం కుసుమ్ కింద విద్యుత్ ఉపకేంద్రాలకు 190 ఎకరాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు స్థలాలు కేటాయించేందుకు ఇదివరకే ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

● జిల్లాలోని శ్రీశైలం, సంగమేశ్వరం తదితర శైవ క్షేత్రాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వచ్చే భక్తుల కోసం బడ్జెట్ హోటళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని లైమ్ స్టోన్ క్వారీల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కుందూనది వంతెన, జొళదరాశి ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ నష్టపరిహారం తదితర పనులకు చర్యలు తీసుకోవాల్సి ఉందని సీఎం చంద్రబాబుకు కలెక్టర్ రాజకుమారి నివేదించారు.





'పది' పరీక్షలకు 780 మంది గైర్హాజర్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన భౌతికశాస్త్రం పరీక్షకు 780 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 130 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 25,158 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా 24,378 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 23 పరీక్షా కేంద్రాలను పరిశీలించగా జిల్లా కోఆర్డినేటర్ మహబూబ్‌బేగ్ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.



శ్రీశైలంలో నేటి నుంచి ఉగాది మహోత్సవాలు

భానుడి భగభగలు

- ఆరంభంలోనే వడగాల్పులు
- మేలో ఉండాల్సిన ఉష్ణోగ్రతలు ఈ యేడాది మార్చిలోనే నమోదు
- 12 గంటలకే ఖాళీ అవుతున్న రోడ్లు





ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా నంద్యాల పట్టణంలోని రహదారి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్చిలోనే ఎండలు భగ్గుమంటున్నాయి. సూర్యుడు తన ప్రతాపంతో సెగలు రేపుతూ భగభగమంటున్నాడు. తెల్లారింది మొదలు 36 డిగ్రీలతో మొదలై 41 డిగ్రీలతో నిప్పుల కొలిమిని తలపించేలా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 11 గంటలు దాటితే ఏదైనా పని నిమిత్తం బయటకు వెళ్లాలన్నా చాలా మంది వడగాల్పుల భయంతో ఇంటికే పరిమితమవుతున్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలకు దూరంగానే ఉంటున్నారు. మధ్యాహ్నం కాకముందే మాడు పగిలిపోయేలా నిప్పులు కురిపిస్తున్నాడు. వీటికి తోడు వడగాల్పులు కూడా వాటి ప్రభావం చూపడంతో ప్రజలకు దప్పిక, నీరసం, డీ హైడ్రేషన్‌లు చుట్టుముడుతున్నాయి. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు రికార్డులు బ్రేక్ చేసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు

● నంద్యాల ప్రాంతాల్లో రికార్డు ఉష్ణోగ్రతలు

నాలుగు రోజులుగా వరుసగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. మార్చి 6వ తేదీన 39.5 డిగ్రీల సెల్షియస్ నమోదు నుంచి రోజురోజుకూ పెరుగుతూ 40.5 డిగ్రీలకు చేరి ప్రజలను బెంబేలెత్తిస్తోంది. సాధారణంగా గత ఏడాది మార్చిలో 32 నుంచి 35 డిగ్రీలలోపే నమోదయ్యాయి. నేడు 36 డిగ్రీలతో మొదలై 41.5 డిగ్రీలకు చేరడంతో విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనన్న ఆందోళన మొదలైంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏప్రిల్‌లో 42 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు, మేలో 45 డిగ్రీల నుంచి 47 డిగ్రీలకు పైగానే చేరుకునే అవకాశం లేకపోలేదని నిపుణులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ 29వ తేదీ అత్యధికంగా 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మే 4వ తేదీన 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయితే ఆ రికార్డులను కూడా ఏడాది అధిగమించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు

● మునుపెన్నడూ లేనంతగా వేడిగాలులు

మానవుని కార్యకలాపాల వల్ల ఏర్పడిన గ్లోబల్ వార్మింగ్‌తో ప్రాణహాని సంభవిస్తోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్‌తో పక్షులు, జంతువుల మనుగడ కూడా కష్టతరమవుతోంది. దీంతో యావత్ జీవరాశి దెబ్బతినడంతో పాటు మనుషులమీద కూడా ఆ ప్రభావం పడుతోంది. మే నెల రాకముందే అత్యంత తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నాయి.

వాతావరణంలో మార్పులే కారణం

- కె.సురేష్‌బాబు, శాస్త్రవేత్త, నంద్యాల ఆర్ఏఆర్ఎస్

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు ఈ ఏడాది మార్చిలోనే అత్యధిక ఉష్ణోగ్రతలకు కారణమవుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగానే మే నెల రాకముందే అత్యంత తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నాయి. ఏప్రిల్, మేనెల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

అటవీ చెక్‌పోస్టుల్లో వాహనాలకు అనుమతి

సున్నిపెంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో నేటి నుంచి ఈనెల 31వతేదీ వరకు ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే వేల సంఖ్యలో భక్తులు పాదయాత్ర, వివిధ వాహనాలలో శ్రీశైలం చేరి భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శించుకుంటున్నారు. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రకాశం జిల్లా దోర్నాల నంద్యాల జిల్లా శిఖరేశ్వరం అటవీ చెక్‌పోస్టులలో 24 గంటలు వాహనాలకు అనుమతి ఇచ్చినట్లు శ్రీశైలం అటవీశాఖ సబ్ డీఎఫ్‌వో అబ్దుల్ రావూఫ్ తెలిపారు.

చేతికొచ్చిన పంట చేజారిపోయె!

- వడగండ్లు, అకాల వర్షంతో భారీగా పంట నష్టం
- వంద ఎకరాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న
- 260 ఎకరాల్లో వరి.. 1419 ఎకరాల్లో మిరప..

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పంట చేజారిపోయింది. వడగండ్లు, అకాల వర్షంతో భారీగా పంట నష్టం జరిగింది. జిల్లాలో ఆదివారం కురిసిన వడగండ్ల వానకు ప్రధానంగా వరి, మామిడి, మిరప రైతులకు తీరని నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు ముందుగా ప్రాథమిక అంచనాలు వేసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులతో గ్రామాల వారీగా పంటనష్టం వివరాలు సేకరిస్తున్నారు.



దెబ్బతిన్న మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు

● భారీగా నష్టపోయిన మిరప రైతులు

జిల్లాలో కోవెలకుంట్ల, గోస్పాడు, దొర్నిపాడు మండలాల్లో మిరప రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోవెలకుంట్ల మండలం రేవనూరు గ్రామ పరిధిలో 208 ఎకరాల్లో 33 శాతం కంటే ఎక్కువగా పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే 82 మంది రైతులు 277 ఎకరాల్లో 33 శాతం కంటే తక్కువగా పంట నష్టపోయినట్లు లెక్క వేశారు. అలాగే గోస్పాడు మండలం ఓంటివెలగల గ్రామ పరిధిలోని 23 మంది రైతులు 65 ఎకరాల్లో (33శాతం కంటే ఎక్కువ), 82 మంది రైతులు 381 ఎకరాల్లో (33 శాతం తక్కువ) పంట నష్టం వాటిల్లింది. దొర్నిపాడు మండలం 35 మంది రైతులు 109 ఎకరాల్లో (33 శాతంకంటే ఎక్కువ), 82 మంది రైతులు 381 (33 శాతంకంటే తక్కువ) నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. మొత్తం 1419 ఎకరాల్లో మిరప పంట నష్టం రాగా సుమారు రూ.60 నుంచి రూ.70 లక్షల మేర పంట నష్టం వాటిల్లింది.

● మొక్కజొన్న రైతుకు నష్టం

కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాల్లో పాల దశలో ఉన్న మొక్కజొన్న పంటను వడగండ్ల వాన దెబ్బతీసింది. కోవెలకుంట్ల మండలం 57 ఎకరాలు, దొర్నిపాడు మండలంలో 45 ఎకరాల్లోనూ పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాలు రూపొందించారు.

● వరి పంటకు తీరని నష్టం

గోస్పాడు మండలంలో పొట్ట దశలో ఉన్న వరి అకాల వర్షానికి నేలకూలింది. మండలంలో 32 మంది రైతులకు చెందిన 260 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. కాని ప్రాథమిక అంచనాలకంటే అధికంగానే వరి పంట నష్టం వాటిల్లింది. క్షేత్రస్థాయిలో నష్ట పరిహారాన్ని సేకరించే వ్యవసాయ సిబ్బంది పంట నీటిలో మునిగిందా.. ఎంత శాతం మేర నీటిలో మునిగింది అన్నది చూసి లెక్క కడతారు. కాని వడగండ్లకు పంట నేలరాలింది.. పైరు కూలింది.. గింజలు నేలపై రాలినవి వారి లెక్కల్లోకి రాకపోవడంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఆదివారం అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలు

మండలం	ఎంఎం
గోస్పాడు	19.0
కోవెలకుంట్ల	18.2
బనగానపల్లె	13.2
ఆళ్లగడ్డ	10.4
ప్యాపిలి	10.4
ఉయ్యాలవాడ	9.2
శిరువెళ్ల	7.6
డోన్	5.8



రుద్రవరం: తడిసిన మొక్కజొన్నలను రహదారిపై ఆరబోసిన రైతులు

కనెక్షన్ లేక కష్టాలు

● గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రైతులకు ఇబ్బందులు ● విద్యుత్ కనెక్షన్ల కోసం రైతుల ఎదురు చూపులు

నంద్యాల కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతులకు కరెంట్ కనెక్షన్ల సమస్య శాపంగా మారింది. నంద్యాల జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో 29 మండలాలలో సుమారు లక్షల ఎకరాలు భూమి సాగులో ఉంది. కాలువలు, బోర్లలో నీరు పుష్కలంగా వున్నప్పటికీ విద్యుత్ కనెక్షన్లు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,05,235 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. 1.10.2024 నుంచి 19.3.2025 వరకు 172 వ్యవసాయ కనెక్షన్లు రిలీజ్ చేశారు. వీటితో మొత్తం వ్యవసాయ కనెక్షన్లతో కలిపి 19.03.2024 వరకు 1,05,707 కనెక్షన్లు ఉన్నాయి. ఈ సంవత్సరం 19.03.2024 నుంచి ఇప్పటి వరకు 11,551 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం అప్లై చేసుకున్నారు. కానీ వీటిలో పైకం చెల్లించిన వారు 4,756 మంది ఉన్నారు. వీరికి కూడా విద్యుత్ కనెక్షన్ ఇప్పటి వరకు ఇవ్వలేదు. వీరు తమకు ఎప్పుడు కరెంట్ కనెక్షన్ ఇస్తారని ఎదురుచూస్తున్నారు. డబ్బులు కట్టిన రైతులకే ఇవ్వలేదని, తాము డబ్బులు కట్టలేదని మిగతా రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్లే విద్యుత్ కనెక్షన్లకు అవసరమైన మెటీరియల్ అందలేదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మెటీరియల్ అనగా ట్రాన్స్‌ఫార్మర్, కండక్టర్స్, కేబుల్స్. 25 కిలోవాట్ ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.2,50,000 అవుతుందని అధికారులు చెప్పారు. ఒక్కొక్క రైతుకు రెండు కిలోవాట్ల ప్రకారం కేటాయిస్తే దాదాపుగా పొలాలు దగ్గర ఉన్న వారికి విద్యుత్ ఇవ్వవచ్చు. కానీ ఇక్కడే తిరకాసు ఉంది. పొలం వద్ద నుంచి ట్రాన్స్‌ఫార్మర్ వరకు విద్యుత్ స్తంభాలు, కేబుల్స్ అధికారులు ఎస్టిమేషన్ వేసి రైతుల నుంచి అధికారులు డబ్బులు తీసుకుంటున్నారు.




● మెటీరియల్ ఇప్పుడిప్పుడే వస్తోంది

గత నెల రోజుల నుంచి మెటీరియల్ వస్తున్నది. వచ్చినదాన్ని వచ్చినట్లుగా రైతులకు సరఫరా చేస్తున్నాం. 25 కిలోవాట్స్ ట్రాన్స్‌ఫార్మర్ దాదాపు రూ.2,50,000 అవుతుంది. రైతులు సమూహంగా వస్తే సర్వే నిర్వహించి రైతులకు అందజేస్తాం. రైతులకు 9గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. అలాగే రైతులు కోరిన విధంగా 22 కేవీ ఫీడర్స్‌ను 2 స్పెల్‌గా కూడా విద్యుత్ అందిస్తున్నాం.

- ఎస్ఈ, సుధాకర్‌కుమార్

బొప్పాయికి చీరకట్టు..!



పెద్దకడబూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్ ప్రారంభదశలోనే ఎండలు దంచికొడుతున్నాయి. పగటి వేళల్లో బయటకు వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇక పంటల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పండ్ల తోటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎండలతో బొప్పాయికి తెగుళ్లు సోకుతున్నాయి. మండలంలోని హనుమాపురం, మేకడోణ, కల్లుకుంట, గంగులపాడు, కంబలదిన్నె వంటి గ్రామాల్లో రైతులు బొప్పాయి సాగు అధికంగా చేశారు. వీటిని కాపాడుకునేందుకు ఆయా గ్రామాల రైతులు వినూత్నంగా ఆలోచించారు. పండ్ల తోటలను కాపాడుకునేందుకు ప్రతి చెట్టుకూ ఓ చీరను చుట్టి ఎండ పడకుండా జాగ్రత్త పడుతున్నారు.

వాహనాలు తుప్పు...



మంత్రాలయం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదవరం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మోటారు సైకిళ్లు తుప్పువడుతున్నాయి. దాదాపు ఎన్నో ఏళ్లుగా కర్ణాటక మద్యం, రోడ్డు ప్రమాదాల కేసుల్లో పట్టుబడిన బైక్‌లను సీజ్ చేస్తున్నారు. వీటిని పోలీస్ స్టేషన్ వెనుకాల పార్కింగ్‌లో ఉంచారు. కొన్ని మోటారు సైకిళ్లు, ఆటోలు, తుప్పు పట్టిపోయాయి. వీటిని యజమానులకు అప్పగించడమా..లేక వేలం వేస్తే.. వచ్చిన డబ్బును ప్రభుత్వ ఖజానాకు జమయినా ఎంతో ప్రయోజనంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చిన్నబోయిన నన్నారి

వేసవి వస్తే ఎవరికైనా మనసు నన్నారి మీదికి పోతుంది. రుచికరమైన సహజ పానీయం ఇది. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రత్యేకం. ఒకప్పుడు నల్లమలలో మాత్రమే నన్నారి వేర్లు దొరికేవి. ఇప్పుడు రైతులు సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు. ధర లేకపోవడంతో పొలాల్లోనే గ్రేడింగ్ చేస్తూ ఆరబెట్టుకుంటున్నారు. జిల్లాలో 100 ఎకరాల్లో నన్నారి సాగు చేశారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో చాగలమర్రి మండలంలో చెంచుగూడెం, చిన్నవంగలి, చాగలమర్రి గ్రామాల్లో 60 ఎకరాలు సాగు చేశారు. రుద్రవరంలో 50 ఎకరాలు సాగులో ఉంది. గత మూడేళ్లుగా నన్నారి(షర్బత్ గడ్డలు) సాగు చేస్తున్నారు.



చిన్నవంగలిలో ధర లేక పొలంలో ఆరబెట్టిన నన్నారి

- నాడు కిలో రూ.550.. నేడు కిలో రూ.150
- కొనేవారే లేక రైతుల ఆవేదన
- దళారుల బెడద అధికం
- కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటూ రైతుల వినతి

చాగలమర్రి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):

ఎకరానికి రూ.2 లక్షలు పెట్టుబడి

ఎకరాల్లో నన్నారి పంట సాగు చేసేందుకు 12 వేల మొక్కలు అవసరం. ఒక్కో మొక్క రూ.2 చొప్పున రూ.24 వేలు ఖర్చు అవుతుంది. కూలీలు, ఇతర ఖర్చులకు రూ.40 వేలు అవుతుంది. మూడేళ్ల పాటు పంట సాగు చేసేందుకు రూ.లక్ష మేర ఖర్చు అవుతుంది. పంట వచ్చాక భూమిలోని నన్నారి గడ్డలు తీసుకునేందుకు ఎకరాకు రూ.50 వేలు ఖర్చు చేయాల్సి ఉంది. పంట దిగుబడులు బాగానే ఉన్నా ప్రస్తుతం ఉన్న ధరకు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. గతంలో కిలో నన్నారి గడ్డలు రూ.550 అడిగేవారని, ప్రస్తుతం ఇతర ప్రాంతాల వ్యాపారులు కొనుగోలు చేయడానికి రావడం లేదని లోకల్ వ్యాపారులు కిలో 150 నుంచి రూ.180 అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఈ ధర వల్ల నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.





నన్నారి గడ్డలను గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలు

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలకు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మార్కెట్ సౌకర్యం లేక వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకుంటున్నారు. రైతులు పంట సాగు చేసి నష్టపోతున్నారు. ఉద్యాన పంటల కొనుగోలుకు దళారుల బెడద లేకుండా చూడాలి. గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలి.

ధర పతనం..

రైతులు ఎంతో ఆశగా సాగు చేసిన నన్నారి గడ్డలకు ధర లేక రైతులు దిగాలు పడ్డారు. ఏడాది పాటు నన్నారి గడ్డలను కాపాడుకుంటూ వచ్చారు. నన్నారి గడ్డలు తవ్వే సమయంలో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు పొలాల్లోనే ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. ఒక చిన్నవంగలి గ్రామంలోనే 20 ఎకరాల దాక నన్నారి సాగు చేశారు. ధర లేకపోవడంతో పొలాల్లోనే ఆరబెట్టుకొని కాపలా ఉండాల్సి వస్తోందని రైతులు విలపిస్తున్నారు. గతంలో కిలో రూ.550 ధర పలికేది. ప్రస్తుతం రూ.150 అడుగుతున్నారు. నన్నారి సాగు చేసిన రైతన్నలు నష్టపోతున్నారు. మూడేళ్లుగా పొలంలో నన్నారి సాగుకు ఎకరానికి దాదాపు రూ.లక్ష మేర నష్టం వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కొనేవారే లేరు



1.75 ఎకరాల్లో నన్నారి సాగు చేశా. ఎకరాకు రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టాను. కిలో రూ.150 అడుగుతున్నారు. దీని వల్ల నష్టపోతున్నాం. పంట సాగు చేసే ముందు ధర ఆశాజనకంగా ఉండటంతో అధిక పెట్టుబడి పెట్టి సాగు చేశా. పంట చేతికొచ్చే సమయంలో ధర పడిపోయి నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వమే ఆదుకోవాలి. - చంద్ర ఓబుళరెడ్డి, రైతు, చిన్నవంగలి

కష్టానికి తగ్గ ఫలితం లేదు



నాలుగు ఎకరాల్లో నన్నారి షర్బత్ గడ్డల పంట సాగు చేశాను. రూ.6 లక్షల మేర పెట్టుబడి పెట్టాను. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. దిగుబడి బాగా ఉన్నా ధర లేదు. వ్యాపారులు ముందుకు రాకపోవడంతో నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. గురునాథ్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



మూడెకరాల్లో నన్నారి సాగు చేశా. ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చు చేశా. నన్నారి గడ్డలు తవ్వే సమయానికి ధర తగ్గింది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కష్టానికి తగ్గ ఫలితం లేదు. గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.
- పి. వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి



శ్రీశైలంలో నేటి నుంచి ఉగాది మహోత్సవాలు

- నేడు స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ
- అమ్మవారికి మహాలక్ష్మి అలంకారం

శ్రీశైలం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తి పీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉగాది మహోత్సవాలు ఈ నెల 31న ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిణి భ్రమరాంబా దేవికి ప్రత్యేక పూజలు, స్వామివారికి వివిధ వాహన సేవలు నిర్వహిస్తారు. 29న ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, 30వ తేదీ ఉగాది పర్వదినాన పంచాంగ శ్రవణం, రథోత్సవం నిర్వహిస్తారు. గురువారం ఉదయం స్వామివారి యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో శివసంకల్పం, గణపతిపూజ, కంకణపూజ, చండీశ్వరపూజ, తదితర పూజలు నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు స్వామిఅమ్మవార్లకు కల్యాణోత్సవం, ఏకాంతసేవ కార్యక్రమాలు జరుగుతాయి.

- కొనసాగుతున్న భక్తుల రద్దీ



భక్తుల రద్దీ

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీగిరి క్షేత్రం కన్నడిగులతో కిక్కిరిసింది. తమ ఆడపడుచైన భ్రమరాంబ అమ్మవారికి చీరసారెను సమర్పించేందుకు లక్షలాది మంది కన్నడ పాదయాత్రికులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో బుధవారం శ్రీశైల క్షేత్రవీధులన్నీ రద్దీగా దర్శనమిచ్చాయి. ప్రత్యేకించి క్యూలైన్లలో కన్నడ భక్తులు బారులుతీరారు. ఉత్సవాలో భక్తుల తాకిడి దృష్ట్యా నేటి నుంచి గర్భాలయంలో అర్జితసేవలు, స్పర్శ దర్శనాలను నిలిపివేసి అలంకరణ దర్శనంమాత్రమే కల్పిస్తున్నారు. దీంతో వచ్చే భక్తులు మూడు క్యూలైన్ల ద్వారా అలంకారణ దర్శనమే చేసుకోవడం వల్ల దర్శనాలు వేగంగా కొనసాగుతాయని దేవస్థానం అధికారులు తెలిపారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు దేవస్థానం సిబ్బంది, శివసేవకులు నిరంతరం తాగునీరు, అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా లడ్డూ కౌంటర్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అడిగినన్ని లడ్డూలు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. దేవస్థానం, వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ చోట్ల వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈఓ ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు.



దర్శనానికి వేచి ఉన్న భక్తులు

'నవోదయ' ఫలితాలు విడుదల

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. విద్యాలయంలో 80 సీట్లకు ఎంపికైన వారి జాబితాను ఆన్‌లైన్‌తో పాటు, పాఠశాల నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. ఎంపికైన విద్యార్థుల హాల్‌టికెట్ల వివరాలు...

జె1039000	ఎన్1039084	కె1039051
జె1038305	ఎన్1038853	ఎం1038503
జె1039815	ఎన్1039759	ఎం1039918
జె1039896	ఎన్1040065	ఎం1039251
జె1041161	ఎన్1040087	ఎం1038712
జె1038476	ఎన్1038986	ఎం1040199
జె1039906	ఎన్1040316	ఎం1038915
జె1041997	ఎన్1042023	ఎం1042489
జె1039066	ఎన్1042753	ఎం1039407
జె1042003	ఎన్1037851	ఎం1041395
జె1038878	ఎన్1043042	ఎల్1038158
జె1039132	ఎన్1042171	ఎల్1038634
జె1039969	కె1037445	ఎల్1038822
జె1042442	కె1042013	ఎల్1039985
జె1039104	కె1037644	ఎల్1041325
జె1039055	కె1038893	ఐ1037681
జె1041434	కె1040090	ఐ1039551
జె1040259	కె1037864	ఐ1037719
జె1037611	కె1040037	ఐ1039788
జె1042067	కె1037638	ఓ1042037
జె1043148	కె1041242	ఓ1042414
జె1043262	కె1040260	ఓ1039853
జె1039895	కె1041313	బి1038057
జె1043103	కె1040104	ఏ1042420
జె1039881	కె1041183	పి.1038614
ఎన్1039074	కె1040352	ఐ1041594
ఎన్1037613	కె1038239	



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న బళ్లారి ఐజీ బీఎస్ లోకేష్ కుమార్, రాయచూరు ఎస్పీ పుట్టు మాదయ్య

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

మంత్రాలయం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం బళ్లారి ఐజీ బీఎస్ లోకేష్ కుమార్, రాయచూరు జిల్లా ఎస్పీ పుట్టు మాధయ్య, ప్రముఖ సినీ దర్శకుడు శంకర్, రాయచూరు ఏఎస్పీ హరీష్ కుటుంబ సమేతంగా వేర్వేరుగా మంత్రాలయం వచ్చారు. వీరికి శ్రీమఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. వీరు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు వారిని ఆశీర్వదించారు.

ఎక్స్‌గ్రేషియాకు దరఖాస్తు చేసుకోండి

కార్మిక శాఖ ఉపకమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈశ్రమ్ కార్డు లబ్దిదారులు ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎవరైనా అసంఘటిత ఈ శ్రమ్ కార్డు కలిగిఉండి ప్రమాదవశాత్తు మరణించిన, పాక్షిక, పూర్తి అంగవైకల్యం పొంది ఉంటే తక్షణమే సంబంధిత డీఆర్‌డీఏ కార్యాలయంలో తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31 వరకు అవకాశం ఉందని మరిన్ని వివరాలకు సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నంద్యాల మీదుగా వారాంతపు సమ్మర్ స్పెషల్ రైలు

నంద్యాల నూనెపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మీదుగా సత్రగచి (కోల్‌కత) నుంచి యశ్వంత్‌పూర్ (బెంగళూరు)వరకు వారాంతపు సమ్మర్‌స్పెషల్ రైలును నడపనున్నట్లు నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌లో మొత్తం 8 సర్వీసులు నడుస్తాయని చెప్పారు. వారాంతపు స్పెషల్ రైలు నెం.02683షాలిమార్ నుంచి సమ్మర్ స్పెషల్ రైలు ప్రతి శుక్రవారం ఏప్రిల్ నెలలో 4, 11, 18, 25 తేదీల్లో నంద్యాలలో మధ్యాహ్నం 3.30గంటలకు బయల్దేరి డోన్ మీదుగా యశ్వంత్‌పూర్‌కు అర్ధ రాత్రి 12.55 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో 02684నెంబరు గల యశ్వంత్‌పూర్ నుంచి ప్రతి శనివారం ఏప్రిల్ నెలలో 5, 12, 19, 26తేదీల్లో ఉదయం 4.55గంటలకు బయల్దేరి డోన్ మీదుగా నంద్యాలకు మధ్యాహ్నం 12.20గంటలకు చేరుకొని షాలిమార్‌కు బయల్దేరుతుందని తెలిపారు. దక్షిణమధ్య రైల్వే అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



గుంతకల్లు మీదుగా..

మద్దికెర: ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగళూరు, కల్బుర్గీ మధ్య వయా గుంతకల్లు అప్ అండ్ డౌన్ ట్రిప్పు ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఎస్ఎంవీటీ, బెంగళూరు, కల్బుర్గీ ప్రత్యేక రైలు నెంబరు 06519 ఈ నెల 28న రాత్రి 9.15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు కల్బుర్గికి చేరుకుంటుందని చెప్పారు. తిరుగు ప్రయాణం రైలు నెంబరు 06520 ఈ నెల 29న ఉదయం 9.35 గంటలకు కల్బుర్గిలో బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు ఎల్లంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, మంత్రాలయంరోడ్డు, రాయచూరు, యాద్‌గిరి, శంషాబాద్ స్టేషన్ల మీదుగా గమ్యస్థానానికి చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

బాలికల హాస్టల్ తనిఖీ

కర్నూలు లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు కలెక్టరేట్ సమీపంలోని బాలికల ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఆనంద నిలయం హాస్టళ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని సౌకర్యాలు, ఆహార నాణ్యత పరిశుభ్రతను పరిశీలించారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన బాలికలకు తెలియజేశారు.



బాలికల హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి

మల్లన్న సేవలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

శ్రీశైలం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను బుధవారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు.



ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో తదితరులు

పాల కల్తీ అరికట్టేందుకు ఉప లోకాయుక్త ఆదేశాలు

• ఆంధ్రజ్యోతి వరుస కథనాలపై ఎఫెక్ట్

కర్నూలు లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సరఫరా చేస్తున్న పాలలో కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతపురం పట్టణంలో పాలలో ప్రాణాంతక రసాయనాలు కల్తి చేసి అమ్మకాలు నిర్వహిస్తున్నారనీ గత నెలలో ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. దీంతో రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని సుమోటాగా కేసు నమోదు చేసి అధికారులకు గతంలో నోటీసులు జారీ చేసింది. కల్తీని అరికట్టేందుకు పాల ఉత్పత్తి కేంద్రాలు, డైరీలు విక్రయ కేంద్రాలపై వివిధ స్థాయిల్లో తనిఖీలు నిర్వహించి శాంపుల్స్ సేకరించి ప్రజలలో అవగాహన పెరిగేలా చర్యలు తీసుకోవాలని గతంలో ఆదేశించారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టులో నిర్వహించిన పీజీ రెగ్యులర్, సప్లిమెంటరీ 2వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. మరిన్ని వివరాలకు ఆన్‌లైన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

31లోపు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి గాను యోగాలో రాష్ట్ర, జాతీయ స్థాయి అంతర్జాతీయ స్థాయిలో సహకారం అందించిన వారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు బుధవారం తెలిపారు. వివరాలకు https://innovateindia.my.gov.in/pm-yoga-awards వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఎస్‌డీవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టుపల్లి గ్రామం సమీపంలో సుంకులమ్మ గుడి దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల్(36) అనే వ్యక్తి మృతి చెందాడు. డోన్ పట్టణంలోని రైల్వే కాలనీకి చెందిన గోపాల్ మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో నిర్వహించిన దేవరకు వచ్చారు. దేవరలో బంధువులతో కలిసి సంతోషంగా గడిపాడు. తిరిగి బైకుపై డోన్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలోని సుంకులమ్మ గుడి దగ్గరకు రాగానే బైకు అదుప తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు.

కోత మిషన్, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

బనగానపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి రహదారిలోని సాయిబాబా ఆలయం సమీపంలో కోతమిషన్ వాహనం ఢీ కొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇరువురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవార జరిగింది. గుత్తి రహదారి వైపు వరి కోత మిషన్ వెళ్తుండగా గుత్తి నుంచి బనగానపల్లెకు మోటార్ బైక్‌పై గడివేముల మండలం మంజనూరు గ్రామానికి చెందిన పెద్దన్న, గోస్పాడు మండలం రాయపాడుకు చెందిన చిన్నకొండయ్య వస్తుండగా ఎదురుగా వస్తున్న వరికోత మిషన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెద్దన్నకు కాలు విరిగిపోయింది. చిన్నకొండయ్యకు స్వల్పగాయాలయ్యాయి. పెద్దన్నకు బనగానపల్లె వైద్యులు పరీక్షించి నంద్యాల వైద్యశాలకు రెఫర్ చేశారు. బనగానపల్లె ఎస్‌ఐ దుగ్గిరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

దేవనకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ కుంకనూరు గ్రామానికి చెందిన రైతు ముంతా చిన్న తిక్కయ్య (57) మృతి చెందారు. వివరాలివీ.. కుంకనూరు గ్రామానికి చెందిన చిన్న తిక్కయ్య సొంతపొలం మూడు ఎకరాలు, కౌలుకు మరో మూడు ఎకరాలలో పంటసాగు చేశారు. అయితే దిగుబడి సరిగ్గా రాకపోవడంతో అప్పులు దాదాపు రూ.7 లక్షలకు పైగా చేరకున్నాయి. కుటుంబ పోషణ కూడా కష్టంగా మారడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. అనంతరం గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.



చిన్న తిక్కయ్య(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టుపల్లి గ్రామం సమీపంలో సుంకులమ్మ గుడి దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల్(36) వ్యక్తి మృతి చెందాడు. డోన్ పట్టణంలోని రైల్వే కాలనీకి చెందిన గోపాల్ మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో దేవరకు వచ్చారు. తిరిగి బైకు మీద డోన్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలోని సుంకులమ్మ గుడి దగ్గరకు రాగానే బైకు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు.

మాజీ కౌన్సిలర్..

డోన్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్ మంగమూరి గోపాల్(38) బుధవారం డోన్ నియోజకవర్గం, ప్యాపిలి మండలం మెట్టుపల్లె గ్రామ దేవరకు బైక్‌పై వెళ్లి తిరిగి చిగురుమాను మిట్ట మీదుగా డోన్‌కు వస్తున్న సమయంలో మెట్టుపల్లె గ్రామం దాటాక బర్రెను ఢీకొని కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్యాపిలి పోలీసులు స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అంబులెన్సులో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై ప్యాపిలి మండల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతుని కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. మృతునికి భార్య సుధారాణి, కుమారుడు సాయి, కుమార్తె శ్రీనిది ఉన్నారు. మృతుడు వైసీపీ మాజీ కౌన్సిలర్‌గా ఉన్నాడు. ప్రస్తుతం రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి ముఖ్య అనుచ రుడిగా ఉండి రాజకీయాల్లో రాణించాడు. అనంతరం మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన సమక్షంలో వైసీపీలో కొనసాగుతున్నాడు.



మంగమూరి గోపాల్ (ఫైల్)

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లూరు చౌడేశ్వరి వీధికి చెందిన యశ్వంత్ (21) అనే యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యశ్వంత్ తండ్రి కృష్ణమోహన్ ఆచారి వడ్రంగి పని చేస్తుంటారు. ఆయన భార్య కూలీ పనులకు వెళ్తుంటారు. యశ్వంత్ కూడా తండ్రి వద్ద వడ్రంగి పనులు నేర్చుకుంటున్నాడు. తరుచూ సెల్‌ఫోన్ చూస్తూ పనికి రాకుండా ఉండటంతో గురువారం ఉదయం తల్లిదండ్రులు మందలించారు. దీంతో కోపంతో యశ్వంత్ సెల్ పగులకొట్టి ఇంట్లోనే ఉండిపోయాడు. తర్వాత భార్య భర్తలిద్దరూ పనులకు వెళ్లారు. ఇంటికి తిరిగి రాగా, కొడుకు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. స్థానికుల సాయంతో యశ్వంత్‌ను చికిత్స నిమ్మితం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యశ్వంత్ (ఫైల్)

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడానికి గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీలను ఎన్నుకోవడానికి న్యాయవాదులు ఎన్నికల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం సాయంత్రానికి ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి సి.విజయకుమార్ తెలిపారు.

ఐదు గ్రేడ్లతో అనర్థం

• ఏ ప్రభుత్వ శాఖలో లేనన్ని పంచాయతీ శాఖలో..
• 20 ఏళ్లు పని చేసినా పదోన్నతులు లేక పదవీ విరమణ
• రెండు గ్రేడ్లుగా చేయాలని పంచాయతీ కార్యదర్శుల విజ్ఞప్తి



కర్నూలు కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

కర్నూలు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ శాఖలో లేని విధంగా ఐదు గ్రేడ్లు పంచాయతీ శాఖలో ఉన్నాయి. మిగతా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల్లో కేవలం రెండు గ్రేడ్లు మాత్రమే ఉంటాయి. అందువల్ల దాదాపు అయిదారేళ్ల వ్యవధిలో పదోన్నతులు లభిస్తాయి. దీనికి పూర్తి భిన్నంగా పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థ ఉంది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 982 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు 890 మంది పంచాయతీ కార్యదర్శులు ఐదు గ్రేడ్లుగా పని చేస్తున్నారు. వీరిలో గ్రేడ్ 1, 2 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతి ప్రక్రియ రాష్ట్ర స్థాయిలో కమిషనరేట్ కార్యాలయం పర్యవేక్షిస్తుంది. ఇక గ్రేడ్ 3, 4, 5 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయం నిర్దేశిస్తుంది. ఈ అధిక గ్రేడ్ల కారణంగా దాదాపు 20 ఏళ్లు పని చేసినప్పటికీ పదోన్నతికి నోచుకోకుండానే పంచాయతీ కార్యదర్శులు పదవి విరమణ చేసిన ఉదంతాలు ఉన్నాయి.

రెండు గ్రేడ్లుగా చేయాలి..

గ్రేడ్ 1, 2 విలీనం చేసి గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శిగా, గ్రేడ్ 3, 4, 5 కలిపి గ్రేడ్ 2గా చేయాలని పలువురు పంచా యతీ కార్యదర్శులు కోరుతున్నారు. బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు తమ పదోన్నతుల్లో వాటా పొందడం వల్ల సింహభాగం పదోన్నతులు వారికే దక్కుతున్నాయి. తమకు కూడా మినిస్టీరియల్ శాఖల్లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు పదోన్నతుల్లో వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇక మండల స్థాయిలో ఉపాధి హామీ, డీఆర్‌డీఏ విభాగాల్లో మండల స్థాయి ఉద్యోగులు కూడా అవుట్ సోర్సింగ్ వారే పని చేస్తున్నారు. కనుక అక్కడ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించి స్థానాలు కేటాయించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇక గ్రామ పంచాయతీకి సంబంధించి ఇంటి, కొళాయి పన్నుల వసూలు, గ్రామ సభలు, గ్రామ పంచాయతీ సమావేశాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మోటారు రిపేర్లు, జనన, మరణ వివాహ ధృవీకరణ పత్రాల పనుల్లో తలమునకలై ఉన్నారు. సర్వే పనులను ఎంపీడీవో పర్యవేక్షిస్తుండగా.. గ్రామ పంచాయతీ పనులపై ఈవోఆర్‌డీ ఆజమాయిషీ చేస్తున్నారు. ఈ పని తమ వల్ల కాదంటూ మండల కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి పని అడకతెరలో పోక చెక్కలా తయారైంది. సచివాలయం నుంచి పంచాయతీకి లంకె తెంపేస్తేనే తమకు విముక్తి కలుగుతుందని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అటకెక్కిన జీవో.నెం.2

గతంలో జీవో.నెం.2 ప్రకారం సచివాలయం అధిపతిగా ఉండే పంచాయతీ కార్యదర్శులను తప్పించి వీఆర్వోలకు పట్టం కట్టారు. తమ జీతభత్యాలు తామే పొందే విధంగా పంచాయతీ కార్యదర్శులను సెల్ఫ్ డీడీవోలుగా ప్రకటించారు. అయితే అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ఆ జీవో అటకెక్కింది. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు సచివాలయానికి డీడీవోగా వ్యవహరిస్తున్నారు. విపరీతమైన సర్వేల భారం వారిపై పడుతోంది. పైగా సచివాలయ సిబ్బంది ఎవరికి వారికి వారి మాతృ శాఖలు సర్వే నుంచి మినహాయింపునిచ్చాయి. దీంతో సర్వేలు పూర్తికాక పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

త్వరగా 1, 2 గ్రేడ్‌గా మార్చాలి



కమిషనరేట్‌లో త్వరితగతిన గ్రేడ్ 1, 2 వారి పదోన్న తులు పూర్తయితే చాలా మంచిది. దిగువనున్న గ్రేడ్ 3, 4, 5 వారి పదోన్నతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. **- గిరి శ్రీకాంత్, కన్వీనర్, నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం**

సచివాలయంతో లంకె తెంపేయాలి



సచివాలయంలో పంచాయతీ కార్యదర్శుల లంకెను తెంపేస్తేనే గ్రామ పంచాయతీలు మనుగడ సాగిస్తాయి. సచివాలయం పని భారం వల్ల కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. **- నరేష్, పంచాయతీ కార్యదర్శి, గోవర్ధనగిరి**

శ్రీమఠం ఆభరణాల లెక్కింపుపై విచారణ



వివరాలు సేకరిస్తున్న జిల్లా జేఈవో, మాధవశెట్టి

మంత్రాలయం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం, ఇతర బ్రాంచులలోని బంగారు, వెండి ఆభరణాలు లెక్కింపుపై జిల్లా జేఈవో పాండురంగారెడ్డి, ఏఏవో మాధవ శెట్టి వివరాలు సేకరించారు. బుధవారం ఏఏవో మాధవ శెట్టి కార్యాలయంలో పెనుగొండ, మహబూబ్‌నగర్, తాడిపత్రి ఆయా మఠాలకు చెందిన బంగారు, వెండి ఆభరణాలను తూకాలు వేసి అధికారులో రికార్డులతో తూకాం చేసి పోల్చి చూశారు. గోవా, పాండిచ్చేరి రాఘవేంద్రస్వామి మఠాలకు వెళ్లి అక్కడున్న ఆభరణాలను లెక్కించి శ్రీమఠానికి, దేవదాయశాఖకు నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం రిటైర్డు ప్రిన్సిపాల్ వాదిరాజాచార్, వెంకటేష్ జోషి, సూరేష్ కోనాపూర్, స్టోర్ ఇన్‌చార్జి రాఘవేంద్రరావు, గిరిధర్ పాల్గొన్నారు.

స్థలాల కేటాయింపునకు ప్రతిపాదనలు

• చేనేత జౌళిశాఖ ఏడీ నాగరాజు రావు



ఎమ్మిగనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు, చేనేత శాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగరాజురావు తెలిపారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మునుపెన్నడూలేని విధంగా కర్నూలు జిల్లా నుంచి చేనేతలు తయారు చేసిన వస్త్రా లను విక్రయించేందుకు మొబైల్ వ్యాన్‌ను ఏర్పాటు చేశామన్నారు. దాని ద్వారా జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చేనేత వస్త్రాలను ప్రదర్శించి విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత మహిళలకు ఉపాధి కల్పించేందుకు నందవరంలోని 40 మంది సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు సంబంధించిన మహిళలకు వివిధ రకాల డిజైన్లు తయారు చేసే శిక్షణ ఇచ్చేందుకు ఓ ప్రాజెక్టు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు భౌగోళిక గుర్తింపు వచ్చేందుకు నాబార్డ్‌కు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. వారు కూడా భౌగోళిక గుర్తింపు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ గుర్తింపు లభిస్తే చేనేత వస్త్రాలకు మంచి ప్రాధాన్యత ఉండడంతో పాటు అమ్మకాలు పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న త్రిఫ్ట్ స్కీంకు సంబంధించి నిధులు మంజూరయ్యే విధంగా సంబంధిత శాఖతో సంప్రదింపులు జరపడంతో రూ.18 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆ మొత్తం చేనేత సభ్యుల ఖాతాల్లోకి త్వరలో జమవుతాయని తెలిపారు. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఈ ఏడాది రూ.1.27కోట్ల 96,580 విలువ చేసే ఉత్పత్తులను తయారు చేసిందని అన్నారు. అలాగే రూ.2.50కోట్లు అమ్మకాలు జరిగాయన్నారు. ఎమ్మిగనూరు తోపాటు నియోజకవర్గంలోని చేనేతలు సొసైటీ కింద మగ్గం నేసేందుకు ఎల్లప్పుడూ అవకాశం కల్పిస్తున్నామన్నారు. చేనేత కార్మికులు వినియోగించుకొని ఉపాధి పొందాలని కోరారు.

టీడీపీ కార్యకర్తపై దాడి.. కేసు నమోదు

• బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే అఖిలప్రియ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

దొర్నిపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుపాపల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అప్పపోగు రమేష్‌పై అదే గ్రామానికి చెందిన అప్పపోగు వెంకటసుబ్బయ్య, వారి బంధువులు దాడి చేశారని ఏఎస్‌ఐ రంగయ్య తెలిపారు. మంగళవారం రాత్రి అప్పపోగు రమేష్ ఇంటి వద్ద నిద్రిస్తుండగా అప్పపోగు వెంకటసుబ్బయ్య, బంధువులు ఇంటి వద్దకు వెళ్లి నిద్రిస్తున్న రమేష్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయని అన్నారు. అప్పపోగు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. నంద్యాలలో చికిత్స పొందుతున్న అప్పపోగు రమేష్‌ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించార

కేఎంసీలో వైద్యులకు పదోన్నతి

కర్నూలు హాస్పిటల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో నలుగురు వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. బుధవారం ప్రభుత్వ బోధానసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యులకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డా.డీఎస్‌వీఎల్ నరసింహం జూమ్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న డా.కే. శివబాల, నగాంజన్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా రేడియాలజీ విభాగంలో డా. జి.రాధికను స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు, జనరల్ సర్జరీలో డా.ఎస్. విజయ్‌బాబు, నంద్యాల ప్రభుత్వ కాలేజీకి డా.మాధవకృష్ణ కడప రిమ్స్‌కు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారు.

ఇంజెక్షన్‌తో ప్రాణాలు కాపాడారు

• గుండె నొప్పితో ఆసుపత్రికి వచ్చిన వృద్ధుడు
• రూ.40 వేలు విలువ చేసే ఇంజెక్షన్ వేసిన వైద్యులు



రూ.40వేల విలువ చేసే ఇంజెక్షన్ వేస్తున్న వైద్యురాలు కల్పన

పత్తికొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుండె నొప్పితో ఆసుపత్రికి వచ్చిన వృద్ధుడికి సకాలంలో ఇంజెక్షన్ వేసి ప్రాణాలు కాపాడారు వైద్యులు. ఈ ఘటన పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో బుధవారం జరిగింది. వివరాలివీ.. దేవనకొండ మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన నరసన్న (65) అనే వ్యక్తికి తెల్లవారుజామున చాతిలో నొప్పి మొదలైంది. వెంటనే కుటుంబ సభ్యులు వైద్యం కోసం హుటాహుటిన పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు డా.కల్పన నరసన్నకు గుండె సంబంధించి వైద్యపరీక్షలు చేయగా.. గుండె సంబంధిత సమస్య గుర్తించి వెంటనే ప్రభుత్వాసుపత్రిలో నిల్వ ఉంచిన రూ.40వేల ఇంజెక్షన్‌ను వేసి ప్రథమ చికిత్స చేయి ప్రాణాలు కాపాడి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. డా.కల్పన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుండెపోటు వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ప్రభుత్వం విలువైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచిందని, ఆ ఇంజెక్షన్లు వేసి ప్రాణాలు కాపాడుకోవచ్చని చెప్పారు.

అర్ధరాత్రి ఆటో డ్రైవర్ వీరంగం

• ఆటోను లోయలో తోసి ఎత్తుకెళ్లారంటూ డయల్ 100కు కాల్
• అప్రమత్తమైన పోలీసులు
• ఆటో డ్రైవర్ నిర్వాకం గుర్తించి మందలింపు



లోయలో పడిన ఆటోను క్రేన్‌తో తీస్తున్న పోలీసులు



ఆటో డ్రైవర్ మనోజ్

కర్నూలు క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఓ ఆటో డ్రైవర్ వీరంగం సృష్టించాడు. మంగళవారం అర్ధరాత్రి డయల్ 100కు ఫోన్ వచ్చింది. దీంతో డయల్ 100 సిబ్బంది కర్నూలు పోలీసులను అప్రమత్తం చేశారు. రాత్రి డ్యూటీలో ఉన్న డీఎస్పీ బాబుప్రసాద్ సమాచారం అందుకున్న వెంటనే అన్ని చెకపోస్టులను అప్రమత్తం చేశారు. ఆటో డ్రైవర్ నెంబరు ఆధారంగా ఫోన్ చేసి సమాచారం తీసుకున్నాడు. నంద్యాల చెక్‌పోస్టు, టోల్‌గేటు, గుత్తి పెట్రోల్ బంకు, రింగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గాలించారు. ఓర్వకల్లు వరకు వెళ్లి పరిశీలించారు. టోల్‌గేట్ దగ్గరకు వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలిస్తే నిందితుడు చెప్పిన ఆటో అటు వైపు రాలేదని గుర్తించారు. కాల్వబుగ్గ దగ్గరకు వెళ్లి సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఓ ఆటో లోయలో పడినట్లుగా గమనించారు. తీరా విచారిస్తే ఇదంతా ఆటో డ్రైవర్ నిర్వాకమే అని తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్ నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వ్యక్తి మనోజ్‌గా పోలీసులు గుర్తించారు. మనోజ్ జమ్మలమడుగు చెందిన మహిళతో వివాహమైంది. భార్య గొడవ పడి జమ్మలమడుగుకు పుట్టింటికి వెళ్లింది. ఆటో డ్రైవర్ తన భార్య కోసం నల్గొండ జిల్లా మిర్యాలగూడ నుంచి వారం రోజులుగా ఆటో నడుపుకుంటూ జమ్మలమడుగుకు బయలుదేరాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో నంద్యాల నుంచి రాత్రి 11 గంటలకు బయలుదేరి కర్నూలు వచ్చే సమయంలో ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని కాల్వబుగ్గ వద్ద లోయలో ఆటో పడి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయలపాలైన ఆటో డ్రైవర్ విచారిస్తే మద్యం తాగిన మత్తులో తాను ఏమీ మాట్లాడానో తెలియడం లేదని, బ్రెయిన్ సరిగా పని చేయలేదని గాయాలతో పోలీసులకు తెలిపాడు. ప్రమాదం జరిగిన వెంటనే కాల్వబుగ్గ నుంచి హుశేనాపురం మధ్యలో ఉన్న నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చి పోలీసులకు ఫోన్ చేశానని చెప్పాడు. అనంతరం ఆటోడ్రైవర్‌ను పోలీసులు మందలించి కౌన్సెలింగ్ చేసి పంపించారు. లోయలో పడిన ఆటోను క్రేన్ సాయంతో తీయించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

నీటి యాజమాన్య లోపంతో ఇబ్బందులు

● ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీజీపీ, కేసీ పరిధిలో నీటి యాజమాన్య లోపం వల్ల నీరు దుర్వినియోగం అవుతోందని, దీంతో ఒక్క తడి కూడా అందక పలువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని టీజీపీ ఎస్‌ఈ శివప్రసాద రెడ్డి కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే టీజీపీ, కేసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేసీకి రిజర్వాయర్ లేదని, టీజీపీకి పంట కాలువలు పూర్తి స్థాయిలో లేకపోవడంపై సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. తెలుగుగంగకు రూ.100 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కేసీ ఆయకట్టుకు కీలకమైన గుండ్రేవులకు సమయం పడుతుందని, అధికారులపై ఒత్తిడి తీసుకురాకుండా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో భవిష్యత్తులో సాగునీటికి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తానన్నారు. టీజీపీ డబ్ల్యూయూఏ ఛైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వారబంది వల్ల నీరు రావటం లేదని అన్నారు. కర్నూలు, నంద్యాల సోనా రకాన్ని కాపాడుకోవటానికి నీరివ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు గంగలో మాన్యువల్ గేట్ల స్థానంలో ఆటోమేటిక్ గేట్లను ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని, కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరారు. కేసీ ఈఈ ప్రతాప్, డీఈఈ రవికుమార్, టీజీపీ డీఈఈ సుబ్రమణ్యేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

నందికొట్కూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపాల్టీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకరరెడ్డి, మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు ఉస్మాన్‌బాషా, మధుబాబు నాయుడు, సాజిదా బీ, జయ, బాలస్వామి, గోకారి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించాలి

మిడుతూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలానికి 2025-26 సంవత్సరానికి కేటాయించిన 1500 మంది ఉపాధి కూలీల లక్ష్యాన్ని సాధించాలని ఎంపీడీవో దశరథరామయ్య సూచించారు. బుధవారం ఏపీవో జయంతి ఆధ్వర్యంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి ప్రభుత్వం కేటాయించిన 1300 మంది ఉపాధి కూలీల లక్ష్యం వంద శాతం సాధించినందుకు సిబ్బందిని ఎంపీడీవో అభినందించారు. గ్రామాల్లో పంటకుంటలు, గోకులాల టార్గెట్లను పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నంద్యాల క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పోలీస్ అధికారులు సూచించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల సబ్‌డివిజన్ ఏఎస్పీ మంద జావలి సూచనలతో నంద్యాల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల పబ్లిక్‌స్కూల్, రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులతో నంద్యాల పట్టణంలోని శ్రీనివాససెంటర్ వద్ద రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ అధికారులు విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిముట్లకు దరఖాస్తు చేసుకోండి

బండిఆత్మకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ పనిముట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో స్వాతి సూచించారు. బుధవారం బండిఆత్మకూరు ఆర్‌ఎస్‌కేలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సగం సబ్సిడీపై ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు రైతులకు మంజూరు చేస్తోందని, స్థానిక రైతు సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

బండిఆత్మకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రఫీక్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31లోపు సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో గానీ, ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఐఎన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 పరీక్ష ఫీజు ఉంటుందని, ఏప్రిల్ 20న స్థానిక మోడల్ స్కూల్ ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

'ఆశా కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలి'

నంద్యాల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బండి ఆత్మకూరు పీహెచ్‌సీ కొత్తపల్లి గ్రామ ఆశా కార్యకర్తను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, రమణకుమారి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ కమిటీ సమావేశం నిర్వహించి రాజకీయ కక్షతోనే విమలను విధుల నుంచి తొలగిస్తూ తీర్మానం చేశారని ఆరోపించారు. విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పగిడ్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మాపురం బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను నంద్యాల జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శంకర్ ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంఈవో సుభాన్ ఉన్నారు.

ఉపాధి సిబ్బందికి శిక్షణ

బండిఆత్మకూరు, మార్చి26(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరులో ఎంపీడీవో అధ్యక్షతన ఉపాధి మేట్‌లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శాశ్వతంగా ఉండే పనులను చేయించాలని కోర్స్ డైరెక్టర్ ఇస్మాయిల్ సూచించారు. ఒక్కొక్క మేట్ 50 మంది కూలీలను గ్రూప్‌గా తీసుకుని పనిచేయించాలని, పనికి ముందు హాజరు తీసుకోవాలని, రూ.300 కూలీ పడేలా కొలత లతో పనులు చేయించాలని సూచించారు. ఎంపీ డీవో దస్తగిరి మాట్లాడుతూ వంద రోజుల పని కల్పనతో గ్రామాల్లో మౌలిక సదపాయాలన్నీ ఉపాధి పథకం ద్వారా పూర్తి చేయించాలన్నారు. ఏపీవో వసుధ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యేలు







గడివేముల, వెలుగోడు, నందికొట్కూరులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు గౌరు చరిత, బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య

గడివేముల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అలాగే మాజీ సర్పంచ్ జమాల్‌బాషా వినతి పత్రం ఇచ్చారు. అనంతరం రూ.38 లక్షల బ్యాంకు రుణాలను పొదుపు మహిళలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు అనసూయమ్మ, మాలిక్‌బాషా, గంగాధర్‌రెడ్డి, రమణమ్మ, టీడీపీ నాయకులు పంటా రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, మురళీమోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గిరిబాబు, హర్షవర్ధన్, జయప్రకాష్ రెడ్డి, సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

వెలుగోడు: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం వెలుగోడు పట్టణంలోని తహసీల్దార్ కార్యలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి నాగమునేశ్వరి, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్, కృష్ణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, సామన్న, జనసేన నాయకులు శాలుబాషా, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి

ఆత్మకూరు: వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే టాప్-20 స్థానాల్లో శ్రీశైలం నియోజకవర్గం నిలువడం సంతోషకరమని, ఇందుకు కృషి చేసిన పార్టీ శ్రేణులను అభినందించారు. అలాగే త్వరలోనే గ్రామస్థాయి నుంచి కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలకు అధిష్ఠానం నుంచి మంజూరైన టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ రామలింగారెడ్డి, ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, నరసింహారెడ్డి, ఉల్లిమధు, బెంజుమన్, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, నాయకులు కలిముల్లా, అబ్దుల్లాపురం బాషా, షాబుద్దిన్, వెన్నా శ్రీధర్‌రెడ్డి, నాగూర్‌ఖాన్, మల్లె ఎలీషా, మల్లికార్జునరెడ్డి, రామ్మూర్తి, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

నందికొట్కూరు రూరల్: పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి కొణిదేల పవన్ కల్యాణ్ తన ఇంటిపేరుతో ఉన్న కొణిదేల గ్రామానికి రూ.50 లక్షలు మంజూరు చేశారని, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. సర్పంచ్ రవియాదవ్, మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి వినతిపత్రాలు ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

నందికొట్కూరు: నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేద్దామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పిలుపునిచ్చారు. బుధవారం నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో నందికొట్కూరు పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 29న జరిగే టీడీపీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ జాకీర్, టీడీపీ నాయకులు సురేంద్ర, రవీంద్రారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

నంద్యాల రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాల, చాబోలు గ్రామాల్లో బుధవారం ఏవో ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. చెన్నయ్య మాట్లాడుతూ వేసవిలో కొర్ర, మినుము పంటలు సాగు చేసుకోవడంతో నేలలోని బ్యాక్టీరియా, శిలీంద్రాల ప్రక్రియ నిరంతరం జరిపి నేల సారవంతంగా ఉంటుందని చెప్పారు. జిల్లా వనరుల కేంద్ర టెక్నాలజీ మేనేజర్ ఉమామహేశ్వరమ్మ, విస్తరణ అధికారి ముక్తార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

ఆత్మకూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): క్యూలెక్స్ దోమ కాటుతోనే బోధకాలు వ్యాధి వ్యాపిస్తుందని, వీటి బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు సూచించారు కరివేన గ్రామంలో బోధకాలు వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం అందించిన కిట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్ బాషా, ఏఎన్ఎం సాయమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పాములపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలూరు గ్రామంలో గత మూడు రోజులుగా అంగన్వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. చివరిరోజు ఏసీడీపీవో మంగవల్లి పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

'రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి'

మహానంది, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పొలం ఉన్న ప్రతి రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ సూచించారు. బుధవారం మహానంది మండలం నందిపల్లిలో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వెటర్నరీ డాక్టర్ శివానంద్ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ సహాయ సంచాలకుడు లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం

● మహాపూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని భూవరహా సహిత పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 25వ వార్షిక వేడుకలను పురస్కరించుకుని చివరి రోజైన బుధవారం భూదేవి, శ్రీదేవి సహిత వేంకటేశ్వరస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం అశేష భక్తజనం నడుమ కమనీయంగా సాగింది. బ్రహ్మోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో సుప్రభాతసేవా, ఆరాధన, నివేదన, మంగళహారతి, చతుఃస్థానార్చన, చక్రస్నానం వంటి పూజాకైంకర్యాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతితో ముగింపు పలికారు. ఆ తర్వాత రాత్రి 7గంటల సమయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో భూదేవీ, శ్రీదేవి సహిత వేంకటేశ్వర స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ గావించి కల్యాణ తంతును ప్రారంభించారు. ముందుగా విశ్వక్సేనారాధణ, పుణ్యాహవచనము, కంకణధారణ, యజ్ఞోపధారణల అనంతరం మాంగళ్యధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తర్వాత కళ్యాణ మూర్తులకు వైభవోపేతంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అల్పాహార వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, పట్టణంలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 19న నంద్యాలకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను కమిషనర్ నిరంజన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కంపోస్టు యార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి కోసం సిద్ధమవుతున్న హెలీపాడ్ ప్రాంతంతో పాటు అనంతరం పట్టణంలోని చలువ పందిళ్లను పరిశీలించారు. కమిషనర్ వెంట ఎంఈ గుర్రప్ప యాదవ్, ఎస్ఎస్ మురళీధర్ తదిరులు ఉన్నారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ

వెలుగోడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలో పలువురు రైతులకు రాయితీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అందజేశారు. 2023లో వెలుగోడు పట్టణానికి చెందిన దూపం నాగేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ రైతు కుటుంబానికి రూ.7 లక్షలు మంజూరు కాగ వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని రైతు భార్య పద్మావతమ్మకు అందజేశారు. మండల ప్రత్యేక అధికారి నాగమునేశ్వరి, ఏడీ ఆంజనేయ, ఏవో పవన్ కుమార్, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు రామలింగా రెడ్డి టీడీపీ నాయయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నుంచి పడి భక్తుడి మృతి

సున్నిపెంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో సిద్ధిరామప్ప షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తు నుంచి కింద పడి గుర్తు తెలియని ఓ కర్ణాటక భక్తుడు మృతి చెందారు. వివరాలివీ.. బుధవారం రాత్రి కర్ణాటక భక్తుడు భవనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. కొన ఊపిరితో ఉన్న భక్తుడిని దేవస్థానం అంబులెన్స్‌లో దేవస్థానం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే భక్తుడి విరాలు తెలియాల్సి ఉంది.

న్యాయవాదుల సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

నందికొట్కూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణ న్యాయవాదుల నూతన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెంకటరాముడు తెలిపారు. బుధవారం పట్టణంలో జరిగిన నందికొట్కూరు పట్టణ న్యాయవాదుల సంఘం కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఎట్టణ అధ్యక్షుడిగా వడ్ల శరభయ్య, ఉపాధ్యక్ష పదవికి కొంగర వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి పదవికి బోయ వెంకటేశ్వర్లు, ఖజానాధికారి పదవికి బలపాల కుమారస్వామి, సంయుక్త కార్యదర్శి పదవికి రమేష్‌నామినేషన్లు వేయగా వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

నంద్యాల క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నిందితులను కోర్టులో హాజరు పరచగా జడ్జి జరిమానా విధించారని ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు, నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావలి సూచనలతో నంద్యాల పట్టణంలో బుధవారం డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు. ఈ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించి మద్యం తాగి వాహనాలు నడిపిన 36మందిని గుర్తించి వారిపై మోటార్‌వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు పేర్కొన్నారు. నిందితులకు నంద్యాల జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ రూ.56,500జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

మూడేళ్ల చిన్నారి ప్రతిభ

● పట విజ్ఞానం, పజిల్ ఛాలెంజ్‌లో రికార్డు



మోక్ష అయాన్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన మూడేళ్ల బుడతడు అతి చిన్న వయస్సులోనే రికార్డ్ బుక్కుల్లో సుస్థిర స్థానాలను కైవసం చేసుకున్నాడు. 2021 ఏప్రిల్ 23వ తేదీన జన్మించిన ఆయాన్ తాజాగా పట విజ్ఞానం(కార్టోగ్రఫీ), పజిల్ ఛాలెంజ్‌లో అతివేగంగా అంటే 12 కదలికలతో, విద్యుత్ వేగంతో 10.04 సెకన్లలో పూర్తిచేసి నోబుల్ వరల్డ్ రికార్డులో స్థానం పొందాడు. నంద్యాల పట్టణం బాలాజీ కాంప్లెక్స్‌లో నివాసముంటున్న శ్రీనివాసరెడ్డి, రమాదేవిల మనువడు మోక్ష అయాన్ ఓ పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. అతి చిన్నవయస్సులోనే భారతదేశ చిత్రపటాన్ని అన్ని రాష్ట్రాల పేర్లను పాటు కేవలం ఒక నిమిషం 55 సెకండ్ల గడగడా చెప్పేసి మరో రికార్డును సాధించాడు. అలాగే చిత్రపటంలో రాష్ట్రాల లేబుల్స్ లేకుండా గుర్తించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తి ప్రశంసలు పొందాడు. 2023లో ఏడాదిన్నర వయస్సులోనే 500 ఫ్లాష్‌కార్డ్‌ను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. 37 జంతువులను, 7 పక్షులను, 12 వాహనాలను, 13 మంది ప్రముఖులను, 12 రంగులను, 5 నేషనల్ సింబల్స్‌ను, 16 రకాల జంతువుల వాయిస్ అనుకరించడంలోను అత్యంత ప్రతిభ చూపాడు.

అయాన్ సాధించిన రికార్డులు

వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, నోబెల్ వరల్డ్ ఆఫ్ రికార్డ్, కిడ్స్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ రికార్డ్

ముస్లింలకు ఇఫ్తార్



నందికొట్కూరులో ప్రార్థన చేస్తున్న ధార సుధీర్

నందికొట్కూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా నందికొట్కూరు పట్టణంలో ముస్లింలకు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డా.ధార సుధీర్ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ముస్లింలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టౌన్ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, జడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, కౌన్సిలర్ నాయబ్, మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, పుపేంద్రారెడ్డి, ఎంపీపీ నబీరసూల్, తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నాయకులు జబ్బార్, అబూబక్కర్ పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్ అని న్యాయవాది రామచంద్రారావు అన్నారు. బుధ వారం పోలీస్‌లైన్ మస్జిద్ ఏ హుదాలో న్యాయవాది రామ చంద్రారావు ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. రామచంద్రారావును ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ సమద్, ముస్లిం జేఏసీ గౌరవ అధ్యక్షుడు అబులైస్, మస్జిజ్ కమిటీ అధ్యక్షుడు ఫకృద్దీన్, ఇమాంమౌలానా పాల్గొన్నారు.



నంద్యాలలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

మట్టి తవ్వకాల విషయంలో విభేదాలు

● టీడీపీ నాయకుల మధ్య ముదురుతున్న వ్యవహారం

● సెల్‌ఫోన్ సంభాషణ ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్

మహానంది, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మట్టి తవ్వకాల విషయంలో టీడీపీ నాయకులు సెల్‌ఫోన్‌లో సంభాషణకు సంబంధించిన ఆడియో బుధవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. మహానంది మండలం గోపవరంలోని బైరవాణి చెరువు నుంచి మట్టి తరలింపు వ్యవహారంలో విభేదాలు రావడంతో బట్టబయలు కావడంతో సంచలనం రేకెత్తించింది. ఈ ఘటన గురించి పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు సమాచారం. వివరాలివీ.. గోపవరం గ్రామంలో బైరవాణి చెరువు ఉంది. కొన్ని రోజుల క్రితం బైరవాణి చెరువు నుంచి మట్టిని తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. దీంతో తాత్కాలికంగా అప్పటి నుంచి అక్రమ మట్టి తరలింపును నిలిపివేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఒకే పార్టీలో వర్గాలు ఉండటంతో మట్టి తరలింపు వ్యవహారంపై మరోసారి వివాదం నెలకొంది. ఈవిషయంపై తాజాగా ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాల నాయకులకు సంబంధించిన సెల్‌ఫోన్‌లోన్ సంభాషణల ఆడియో బయటికి రావడం కలకలం రేపింది.

అడ్డు వస్తే వాహనంతో తొక్కించేస్తా

చెరువు మట్టి తరలించేటప్పుడు ఎవరు అడ్డువచ్చినా వాహనంతో తొక్కించేస్తా అంటూ టీడీపీకి చెందిన ఓ నాయకుడు అదే పార్టీకి చెందిన మరో నాయకుడితో ఫోన్‌లో సంభాషణల ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. మహానంది మండలంలో ఉన్న చెరువుల నుంచి ఇటుకల బట్టీలకు మట్టిని తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో గోపవరం గ్రామానికి చెందిన బైరవాణి చెరువు నుంచి ఓ టీడీపీ నాయకుడు మట్టిని తరలించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. అయితే అదే గ్రామంలో టీడీపీ పార్టీ లో మూడు వర్గాలు ఉండటంతో వివాదం చెలరేగింది. దీంతో అక్రమంగా తరలిస్తున్న మట్టి వ్యవహారం బహిర్గతమైంది. ఇందుకు అధికారులు కూడా సహకరించినట్లు వారి సంభాషణలో తెలిసిపోయింది. లక్షల రూపాయలు కొల్లకొట్టేందుకు టీడీపీ నాయకులు వైసీపీ నాయకులు కూడా అడ్డు పడటంతో అక్కడ ఏమి జరుగుతొందో తెలియక గ్రామస్థులు భయందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, మైనింగ్ అధికారులు అడ్డుచెప్పక పోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. ప్రస్తుతం అక్రమ మట్టి తరలింపు నిలిచిపోయిన గ్రామంలో నాయకుల మధ్య విభేదాలు పెరిగినట్లు తెలుస్తోంది. అయితే మట్టి తరలించుకొంటూ సొమ్ము చేసుకొందాం.. వచ్చిన ఆదాయంలో అందరం సమానంగా పంచుకొందాం అంటూ చివరకు టీడీపీ నాయకుల సంభాషణలు వైరల్ కావడంతో రాజకీయం వేడెక్కింది.

కవులు, కళాకారులను ప్రోత్సహిస్తాం

- అరుణభారతీసాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



నాట్య గురువు నీరజారెడ్డిని సత్కరిస్తున్న బీసీ రాజారెడ్డి, తదితరులు

బనగానపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అరుణ భారతీసాహితీ సంస్థ ఆధ్వర్యంలో కవులు, కళాకారులను ప్రోత్సహిస్తామని అరుణభారతీసాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బీసీ రాజా రెడ్డి తెలిపారు. మండలంలోని యాగంటి క్షేత్రంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా ఇండియర్ కల్చరల్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య గురువు డాక్టర్ నీరజాదేవి ఆధ్వర్యంలో ఉమామహేశ్వరస్వామికి నృత్య నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ కళాకారులకు తాము ఎల్లప్పుడూ సహకారం అందిస్తామన్నారు. అనంతరం నాట్య గురువు నీరజారెడ్డికి బీసీ రాజా రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఈవో చంద్రుడు, టీడీపీ నాయకుడు మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి, పారిశ్రామికవేత్త నాగిరెడ్డి, శంఖేశ్వరరెడ్డి, రామశేఖర్, నడిపి భూషన్న, అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో మంచి దిగుబడులు

● వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

ప్యాపిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి విధానంతోనే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని జల దుర్గం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఒకే పంట వేయడం వలన పంట దిగుబడులు సరిగా రావన్నారు. పంట మార్పిడి విధానాన్ని తప్ప క పాటించాలన్నారు. అలాగే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పం డించిన ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో రాజేష్, అశోక వర్ధన్, నరేంద్రరెడ్డి, కేసీ మద్దిలేటి, రైతులు పాల్గొన్నారు.

పశువుల తొట్లకు నీటి విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పశువుల తొట్టిలో నీరు

కొలిమిగుండ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిరుపయోగంగా మారిన పశువుల తొట్లకు ఎట్టకేలకు నీరు నింపారు. 23న ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'మూగ రోదన ' నిరుపయోగంగా నీటి తొట్లు అనే శీర్షిన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొలిమిగుండ్లలోని నాయినిపల్లె రహదారిలో నీటి తొట్టిని గ్రామ సర్పంచ్ శివ మరమ్మతులు చేయించి నీటిని విడుదల చేయించారు. అలాగే మండలంలో అందుబాటులో ఉన్న పశువుల తొట్లను నీటితో నింపుతామని ఎంపీడీవో ప్రసాద రెడ్డి అన్నారు. రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించండి

కోవెలకుంట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వల్లంపాడు, పొట్టిపాడు గ్రామాల్లో భూముల రీసర్వేపై రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి, పొట్టిపాడు నాయకులు సుందరేశ్వర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, డీఐవో చంద్రశేఖర్, మండల సర్వేయరు వీరన్న, వీఆర్వోలు, విలేజీ సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కొలిమిగుండ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న దుమ్ముతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కొలిమిగుండ్ల, కల్వటాల రైతులు అధికారులకు విజ్ఞప్తిచేశారు. బుధవారం కాలుష్య నియంత్రణ అధికారులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించారు. వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. రైతులు గూడూరు నాగేశ్వరరెడ్డి, పుల్వయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే ధ్యేయం

ప్యాపిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమమే ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. బుధవారం పట్టణంలో పేదముస్లింలకు ఆమె రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. అనంతరం ఆమె స్థానిక జామియా మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఖాజాపీర్, రామ్మోహన్, చల్లా వీరాంజినేయులు పాల్గొన్నారు.

వరాల మాసం పవిత్ర రంజాన్

- ఫిత్రా, జకాత్ ఈదుల్ ఫితర్ కంటే ముందే ఇవ్వాలి



నమాజ్ చేస్తున్న ముస్లింలు

రుద్రవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ నెల అంటేనే వరాల నెల. మానసిక ఆధ్యాత్మిక వికాసానికి , జీవన సాఫల్యానికి అవసరమైనవన్నీ అందించే ఈ నెలలోనే ఖురాన్ గ్రంథం అవతరించింది. అప్పుడే రంజాన్ ఉపవాసాల నిర్ణయం కూడా జరిగింది. ఉపవాసం ఉండటం ద్వారా మనిషికి ఓర్పు, సహనం మనస్సు స్థిరత్వం, సేవాగుణం అలవడతాయి. పేదల కష్టాలు , ఆకలి బాధలు తెలుస్తాయి. ఫలితంగా తోటి మానవులను ఆదుకోవాలన్న సద్గుణం పెంపొందుతుంది. ప్రతి ఒక్కరూ పండగ నమాజ్‌కు ముందే ఫిత్రా దానం చేయాలి. ఇది సర్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలు వేస్తుంది.

రంజాన్ మాసంలో రూపాయి దానం చేస్తే రూ. 70 విలువ చేసే పుణ్య ఫలం లభిస్తుందన్న మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించి ముస్లింలు పెద్ద ఎత్తున దాన ధర్మాలు చేస్తారు.

రంజాన్ పండుగను 'ఈదుల్ ఫితర్ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఈనెలలో ఆర్థిక స్థోమత ఉన్న ముస్లింలు 'ఫిత్రా'లు ఇస్తారు. ఫిత్రా అంటే దాన ధర్మాలు అని అర్థం. ఎవరి దగ్గర ఏడున్నర తులాల బంగారం, 52.5 తులాల వెండి లేదా.. వీటి విలువకు సరిపడ్డా నగదు, డిపాజిట్స్ ఉంటాయో



దానం చేస్తున్న దృశ్యం

వాళ్లంతా ఫిత్రా ఇవ్వాలనే నిబంధన ఉంది. ఈ డబ్బు రంజాన్ పండుగ కంటే ముందు రోజు లోపు పేదలకు ఇవ్వాలి. ఈ ఫిత్రాలను తీసుకునేవాళ్ల ఇంట్లో ప్రతి ఒక్కరికీ 1.6 కిలోల గోధుమల ధర చొప్పున లెక్కించి డబ్బు, బట్టలు, వస్తువుల రూపంలో ఇస్తారు. అయితే ఈ ఫిత్రాను పండుగ ప్రత్యేక నమాజు ఈదుల్ ఫితర్ కంటే ముందు ఇవ్వాలి. స్థోమత ఉండి ఫిత్రా ఇవ్వని వ్యక్తి నెల రోజులు ఉపవాసాలు పాటించినా లాభం లేదని ముస్లింల విశ్వాసం. రంజాన్ నెలలో పేద ముస్లింలకు 'జకాత్' ఒక వరం లాంటిది. రంజాన్ పండుగను పేద ముస్లింలు కూడా సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంలో జకాత్ అనే విధానాన్ని ఖురాన్‌లో చెప్పారు. ఇస్లాం ధర్మ శాస్త్రం ప్రకారం ఏడాది పాటు సంపాదించిన నగదు, వెండి, బంగారం ఆభరణాల విలువలో రెండున్నర శాతం విలువైన వస్తువులు లేదా నగదు జకాత్ పేరిట పేదలకు దానం చేయాలి. వ్యవసాయ భూములు, పశువులు, గొర్రెలు, మేకలు.. ఇలా దేని మీద ఆదాయం వచ్చినా అందులో నుంచి పేదలకు రెండున్న శాతం దానం చేయాలి.

నేడు షబ్బె బడేరాత్

చాగలమర్రి: రంజాన్ మాసంలో చివరి శుక్రవారానికి ముందుగా వచ్చే షబ్బె బడేరాత్ అతి ముఖ్యమైన పండుగ. ఈ పండుగను గురువారం ఆయా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి జాగరణ చేస్తారు. ఈ రోజు ప్రార్థన చేస్తే వెయ్యి రోజుల పుణ్య ఫలం లభిస్తుందని ముస్లింల నమ్మకం. అందుకే పిల్లలు, పెద్దలు, యువకులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అల్లాను దువా చేయనున్నారు.

30 రోజుల పాటు ప్రత్యేక నమాజ్‌లు, ఉపవాస దీక్షలు



రంజాన్ మాసం ప్రారంభమైనప్పటి నుంచి 30 రోజుల పాటు ప్రత్యేక నమాజ్‌లు (తరావి), ఉపవాసదీక్షలు పుణ్యఫలాలు సిద్ధిస్తాయని మహ్మద్ ప్రవక్త (స.అ.స) ఆదేశాలు ఉన్నాయి. విధిగా తరావీ నమాజ్‌లు చదవాలి. సూర్యోదయం కాక మునుపే ఉపవాస దీక్ష ప్రారంభించి సూర్యాస్తమయం తరువాత ఇఫ్తార్‌తో దీక్ష విరమణ చేయాలి. దాన ధర్మాలు చేయాలి.

- మహ్మద్ నజీర్ అహ్మద్, హఫీజ్, రుద్రవరం

నీటి యాజమాన్య లోపంతో ఇబ్బందులు

● ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీజీపీ, కేసీ పరిధిలో నీటి యాజమాన్య లోపం వల్ల నీరు దుర్వినియోగం అవుతోందని, దీంతో ఒక్క తడి కూడా అందక పలువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని టీజీపీ ఎస్ఈ శివప్రసాద రెడ్డి కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే టీజీపీ, కేసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులు కూడా నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేసుకుంటే నష్టాలు ఉండవని సూచించారు. రైతులందరూ ఒకే సమయంలో వేసుకుంటే నీరు అందించడంలో కూడా ఇబ్బందులు ఉండవమని, ఆ మేరకు పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కేసీకి రిజర్వాయర్ లేదని, టీజీపీకి పంట కాలువలు పూర్తి స్థాయిలో లేకపోవడంపై సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. తెలుగుగంగకు రూ.100 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కేసీ ఆయకట్టుకు కీలకమైన గుండ్రేవులకు సమయం పడుతుందని, అధికారులపై ఒత్తిడి తీసుకురాకుండా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆళ్లగడ్డ నియోజకరవ్గంలో భవిష్యత్తులో సాగునీటికి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తానన్నారు. టీజీపీ డబ్ల్యూయూఏ చైర్మన్ సంజీవ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ వారబంది వల్ల నీరు రావటం లేదనిఅన్నారు. కర్నూలు, నంద్యాల సోనా రకాన్ని కాపాడుకోవటానికి నీరివ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు గంగలో మాన్యువల్ గేట్ల స్థానంలో ఆటోమేటిక్ గేట్లను ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని, కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో కేసీ ఈఈ ప్రతాప్, డీఈఈ రవికుమార్, టీజీపీ డీఈఈ సుబ్రమణ్యేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అఖిల ప్రియ

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



అర్జీ స్వీకరిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ప్రజా వేదిక లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హంద్రీ నీవా కాలువ నీటితో గూటుపల్లె చెరువును నింపాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ఏపీ రైతు సంఘం నాయకులు సభ్యులుల వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి.సుబ్బరాయుడు, పి.రామమోహన్, కిస్టన్న, సి.శ్రీనివాసులు ఉన్నారు.

● బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో టీడీపీ నాయకులు బుగ్గన ప్రభాకర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వెంకటేశ్వర్లు, స్వప్న రాణి ప్రియ, వైద్యసిబ్బంది, డోన్ ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్, కమిషనర్ హరిప్రసాద్, టీడీపీ నాయకులు ఎల్లనాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మి, సోమశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, గౌరీ వెంకట్రామిరెడ్డి, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బేతంచెర్ల మండల కేంద్రంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కార్యకర్తలతో బుధవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యకర్తలతో మాట్లాడుతూ సమాలోచనలు జరిపి పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలను చర్చించారు. అలాగే స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ముస్లింలకు ఎమ్మెల్యే కోట్ల ఇఫ్తార్

డోన్ రూరల్: పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో బుధవారం రాత్రి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాష్ రెడ్డి, కూతురు కోట్ల నివేదితమ్మ పాల్గొని ముస్లింలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎక్సైజ్ స్టేషన్ సీఐ వరలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, ఓబులాపురం శేషిరెడ్డి, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, మర్రి రమణ, ఓంప్రకాష్, ముస్లింలు పాల్గొన్నారు.

పీ-4 సర్వేలో 72 కుటుంబాల గుర్తింపు

డోన్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదరికం నిర్మూలనలో భాగంగా కుటుంబ చేయూతను అందించేందుకు పీ-4 సర్వేను ప్రవేశ పెట్టిందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు అన్నారు. బుధవారం పట్టణంలోని నెహ్రూనగర్‌లోని 14వ వార్డు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీ-4 సర్వేను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, వాటిని దాదాపు పూర్తి చేశామని, ఈ సర్వేలో 72 పేదరిక కుటుంబాలు గుర్తించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమా మహేశ్వరి, టీడీపీనాయకులు ఎల్లగౌడు, గుండాల జయరాముడు, ఆనంద్, సచివాలయం అడ్మిన్ జనార్దన్‌నాయక్, నాగరాజునాయక్, జగదీష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని మద్యం దుకాణాలను ఆళ్ల గడ్డ ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. అలాగే ముత్యాలపాడు, మల్లేవేముల, నవోదయ పెట్రోల్ బంకు సమీపంలోని దుకాణాలను తనిఖీ చేసి స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్, పోలీసులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

రుద్రవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలని ఏపీవో ప్రతాప్ అన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీవో మాట్లాడుతూ పనుల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ సుబ్బన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

బనగానపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని జుమ్మా మసీదులో బుధవారం రాత్రి రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. మొత్తం 28 మసీదుల్లో మంత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రరెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన సోదరుడు టీడీపీ నాయకుడు బీసీ రామనాథరెడ్డి జుమ్మామసీదులో అల్పాహార విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాయలసీమ సలాం, నియాజ్‌హుసేన్, అహ్మద్‌హుసేన్, పూలకలాం పాల్గొన్నారు.



భోజనాన్ని వడ్డిస్తున్న మంత్రి సోదరుడు బీసీ రామనాథరెడ్డి

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

బనగానపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లలిత, జంతుశాస్త్ర అధ్యాపకులు, సెమినార్ కన్వీనర్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అంతర్జాతీయ సెమి నార్ నిర్వహించారు. ఇంగ్లాండ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సంతోష్‌కుమార్ వీసీలో మాట్లాడుతూ క్షయవ్యాధి వ్యాప్తి, నివారణ, చికిత్సా విధానాలు, తాజా పరిశోధనల గురించి వివరించారు. క్షయవ్యాధి పై అవగాహన, సమయానికి సరైన చికిత్స పొందడం, గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సెమినార్లు కళాశాలలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నీతమ్మ, బాబూనాథ్, వసుంధర, సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, నాగరాజారెడ్డి, ఉమాశంకర్ విద్యార్థులు పాల్గొన్నారు

ముందస్తు జాగ్రత్తగా రెండు బోర్లు ఏర్పాటు

రుద్రవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మేజరు గ్రామ పంచాయతీ పరిధిలో వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యగా సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బోర్లు తవ్విస్తున్నట్లు ఈవో సుబ్బారావు బుధవారం తెలిపారు. వారాంతపు సంత మార్కెట్లో ఒక బోరు వేయించామన్నారు. మరో బోరు వేయిస్తామని తెలిపారు. గ్రామంలోని ప్రజలకు తాగునీరుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు బోర్లు మంజూరయ్యాయన్నారు. వీటి ద్వారా అన్ని కాలనీలకు, పాత మంచినీటి పథకాలును రెక్టిపై చేస్తున్నామన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్యాపిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాలను డీఈవో తనిఖీ చేశారు. మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చ రించారు. అనంతరం డీఈవో పోలీస్ స్టేషన్‌లో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల అధికారులతో మాట్లాడారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న పది పరీక్షా కేంద్రాలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల బుధవారం తనిఖీ చేశారు. సంబంధిత ప్రశ్న పత్రాల రికార్డులను పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 757 మంది విద్యార్థులకు గాను 740 మంది విద్యార్థులు హాజరయ్యారని, 17 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

30న పోలేరమ్మ జాతర

రుద్రవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో ఈ నెల 30న పోలేరమ్మ జాతర నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. జాతర సందర్భంగా సీనియర్, జూనియర్ కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు, గుండు పందెం, ట్రాక్టరు రివర్స్ పందెలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. పోలేరమ్మ జాతర జయప్రదం చేయాలని కోరారు.

ముగిసిన పెద్దమ్మ దేవర

ప్యాపిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో రెండు రోజుల పాటు జరిగిన పెద్దమ్మ దేవర బుధవారం ముగిసింది. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ వేర్వేరుగా పెద్దమ్మను దర్శించుకొని పూజలు చేశారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

దొర్నిపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని దినాలు కల్పించాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీవో గంగన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో వచ్చే అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో రంగ నేతాజీ సూచించారు. బుధవారం మండలంలోని చాగలమర్రిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, వీహెచ్ఏలు సుబ్బరాయుడు, దివ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

చాగలమర్రి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో నిర్మల సూచించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మార్చి చివరి నాటికి ఉపాధి లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. నీటి కుంటల టార్గెట్‌ను సాధించాలని, రైతులను ప్రోత్సహించాలన్నారు. మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఈసీ, ఆపరేటర్లు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



మాజీ సర్పంచ్ వెంకటస్వామితో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

బేతంచెర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి మాజీ సర్పంచ్ వెంకటస్వామిని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, తిరుమలేశ్వరరెడ్డి, శ్రీరాములు, రంగస్వామి పాల్గొన్నారు.

పెద్దమ్మకు పూజలు

డోన్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలం మెట్టుపల్లె గ్రామంలో బుధవారం జరిగిన పెద్దమ్మతల్లి దేవరకు డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. పెద్దమ్మతల్లి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్యాపిలి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మెట్టుపల్లె సుదర్శన్, ఈశ్వర్, మాధవ కృష్ణారెడ్డి కుమారుడు చిన్న, చలమారెడ్డి ఆహ్వానం మేరకు గౌతమ్ రెడ్డి దేవరలో పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

డోన్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్యాపిలి మండలం ఆలేబాదు తండా పెద్దపూదిల్ల గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో నిందితులను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి ఒక మోటారు బైక్, 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉపాధి హామీలో బదిలీలు



బదిలీ అయిన సిబ్బందిని సన్మానించిన ఏపీడీ, ఎంపీడీవో

ఉయ్యాలవాడ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ఉపాధి హామీ శాఖలో బదిలీలు జరిగినట్లు ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా బదిలీ అయిన సిబ్బందిని ఏపీడీ సాంబశివరావు, సిబ్బంది శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు.

శాంతినగర్‌లో బోరుకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శాంతినగర్‌లో బుధవారం బోరుకు మరమ్మతులు నిర్వహించినట్లు సర్పంచ్ శివరాముడు తెలిపారు. బోరు బావిలో నీరు తగ్గిపోవడంతో నూతన పైపులు వేశామన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

కొలిమిగుండ్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెంటలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మాలమహానాడు నాయకులు శ్రీరాముల బాలన్న విజ్ఞప్తి చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సచివాలయ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు.

న్యాయవాదులపై దాడులు అమానుషం

బనగానపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సొసైటీలో న్యాయాన్ని నిలబెడుతున్న న్యాయవాదులను హతమారుస్తుండడం దారుణమని బనగానపల్లె బార్ అసోసియేషన్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లాకు చెందిన న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా బనగానపల్లె కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేమ్స్, బాబు, రాజాకుళాయి, శ్రీనివాసులు , సల్మాన్ పాల్గొన్నారు.